వెటర్నరీ డాక్టర్ కావలెను!

- కుక్కునూరు పశు వైద్యశాలలో అందని వైద్యం
- రైతులకు ఇబ్బందులు

కుక్కునూరు: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో పశువులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసిత మండలమే కదా అన్న చిన్నచూపో, ఎవరూ అడిగేవారు లేరన్న నిర్లక్షమో కాని కుక్కునూరు పశువైద్యశాలకు డాక్టర్‌ను కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో కూడా డాక్టరే కాదు కనీసం అటెండర్, వెటర్నరీ అసిస్టెంట్‌ను కూడా కేటాయించకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 పంచాయతీలున్న కుక్కునూరు మండలంలో పశు వైద్య శాలలకు ఇన్‌చార్జులు కాకుండా పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని కేటాయించాలని పాడి రైతులు కోరుతున్నారు. కుక్కునూరు మండలంలో గేదెలు, ఆవులు సుమారు 20 వేలు, మేకలు, గొర్రెలు 20 వేలు ఉన్నాయి.


కుక్కునూరు పశు వైద్యశాల

రెగ్యులర్ డాక్టర్‌ను కేటాయించాలి



ఇంట్లో పెంపుడు జంతువుకు అనారోగ్య సమస్య తలెత్తితే కుక్కునూరు ప్రభుత్వ పశు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లాను. అక్కడ వైద్యుడు లేకపోవడంతో ప్రైవేటుగా వైద్యం చేయించుకున్నాను. డాక్టర్‌ను కేటాయించాలని గతంలో ఫిర్యాదు కూడా చేశాను. ప్రభుత్వం ఇప్పటికైనా రెగ్యులర్ పశువైద్యుడిని నియమించి పశు వైద్యాన్ని మెరుగుపరచాలి.

– కొశారు చలపతి, కుక్కునూరు

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళాలు


ఆలయం వద్ద విరాళాలు అందిస్తున్న దాతలు

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో నిర్మిస్తున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ కోశాధికారి విశ్వనాథ శర్మ గురువారం తెలిపారు. ఫొంగ్రి చిన్న బుజ్జి రూ.50,001, పర్వతనేని శ్రీనివాస్ రూ.11,116 అందజేశారన్నారు. గత ఆలయానికి వెనుక సుమారు రూ.30 లక్షల రూపాయల అంచనాతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. విరాళాలు అందించేందుకు ఫోన్ నెంబర్లు 93478 86999, 85007 36777లో సంప్రదించాల్సిందిగా ఆయన భక్తులకు సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ


బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: డాంగేనగర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన పాడుదోలు నాగేంద్ర కుటుంబానికి గురువారం జంగారెడ్డిగూడెంకు చెందిన రెడీమ్ సంఘ సభ్యులు రూ.32 వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రమ్య, కావేరి, రవి, నేత్రు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు డీసీపీగా కామవరపుకోట వాసి


కంభం ప్రవీణ్ గౌతమ్

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్, కామవరపుకోటకు చెందిన కంభం విజయరాజు తనయుడు ప్రవీణ్ గౌతమ్ తమిళనాడులోని తిరుపూర్ పట్టణానికి డీసీపీగా ఎంపికయ్యారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్ గౌతమ్ 2023 నుంచి తమిళనాడు రాష్ట్రంలో కన్యాకుమారి అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ, డీసీపీగా ప్రమోషన్ పొందారని విజయరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గౌతమ్‌కు ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, కుటుంబ సభ్యులు

బుట్టాయగూడెం: ప్రముఖ గుండె వైద్య నిపుణుడు కుమ్మర చినవెంకటేశ్వరరావు సంస్మరణ కార్యక్రమం సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మారుమూల కుగ్రామంలో జన్మించిన ఆదివాసీ బిడ్డ డాక్టర్ చినవెంకటేశ్వరరావు మృతి తీరనిలోటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని చినవెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చదివిన పాఠశాలకే హెచ్ఎంగా రాక


జయకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించిన అరుదైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానిక ఆదివారపు పేట ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వీకే జయకుమార్ చదువుకున్నారు. ఈ నెలలో చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఆయన ప్రధానోపాధ్యాయునిగా తాను చదివిన పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ఆయనను గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. జయకుమార్‌ను సత్కరించిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఒబిలిశెట్టి బాబురావు, గొంతిన రామకృష్ణ, బోయిన సతీష్, మక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామవరపుకోట: ఉప్పలపాడు వ్యవసాయ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈనెల 13, 14 తేదీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోలవరం రూరల్: పోలవరం ఫీడర్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం, రామయ్యపేట, కృష్ణారావుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

యథావిధిగా బస్సుపాసుల జారీ

జంగారెడ్డిగూడెం: ఏపీఎస్ ఆర్టీసీ 2025–26వ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 13వ తేదీ నుంచి విద్యార్థులకు యథావిధిగా బస్సు పాసులు అందించనున్నట్టు డిపో మేనేజ్ గంగాధర్ తెలిపారు. విద్యార్థులు బస్సు పాసులు తీసుకోవచ్చన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసాలు


జంగారెడ్డిగూడెం : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆర్డీఓ రమణ


కామవరపుకోట : కొండగూడెం కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆదర్శిలా నవ చేతన కొత్త కరికులంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ ఆర్‌వీ రమణ అంగన్‌వాడీలో కొత్తగా నమోదైన ప్రీ స్కూల్ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. పిల్లలకు ఆటపాట ద్వారా విద్యను అభ్యసింపచేసి మంచి పునాది వేయాలని సూచించారు. సీడీపీఓ పి.బ్యూల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు తెలుగు అభ్యాస దీపిక, ఇంగ్లిషు వర్క్‌బుక్, యాక్టివిటీ బుక్కు, మ్యాథ్స్ వర్క్ బుక్ ఒక సెట్ చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు విజయనిర్మల, శిరోమణి, కరీమునిస, ప్రీస్కూల్ చిన్నారులు హాజరైనారు

పిల్లలను అంగన్‌వాడిలో చేర్పించండి

కామవరపుకోట: మూడేళ్లు నిండిన బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి తల్లిదండ్రులను కోరారు. గురువారం కామవరపుకోట పంచాయతీలోని కొండగూడెం సచివాలయంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. జూన్ 12 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని మంగాదేవి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన అందిన విద్య అందేలా కృషి చేస్తున్నట్టు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ యూఎస్‌వీ పద్మావతి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో గురువారం అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. 2.5 ఏళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పద్మావతి కోరారు. చిన్నారులకు విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ

ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన

బుట్టాయగూడెం: మండలంలోని కె.అంకంపాలెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ఖరీఫ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం విస్తీర్ణ అధికారి డాక్టర్ వి.దీప్తి అరటి, మినుము, పెసర, వరి పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. భూసార, ఆకు పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెల పరిశోధనా సంస్థ వెంకటరామన్నగూడెం సీనియర్ శాస్త్రవేత్త కె.నాగరాజు కుమారి మాట్లాడుతూ కోళ్లల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గేదెల్లో గొంతువాపు వ్యాధి నివారణ టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ డి.ముత్యాలరావు, గ్రామ వ్యవసాయకులు, పశువైద్య సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


కె.అంకంపాలెంలో మాట్లాడుతున్న కేవీకే విస్తీర్ణ అధికారి దీప్తి

పేదలకు భూములు ఇవ్వాలి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో పరిహారం చెల్లించిన భూములను నిరుపేదలకు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కుక్కునూరు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బయ్యన శ్రీను మాట్లాడుతూ, మండలంలో 41.15 కాంటూర్ పరిధిలోని 8 గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత, భూ పరిహారాన్ని చెల్లించిన నేపథ్యంలో ఆ భూములను నిరుపేదలు సాగు చేసుకునేలా పంపిణీ చేయాలని కోరారు. ఈ భూముల్లో మోటార్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.నాగేంద్రరావు, పట్ల లక్ష్మయ్య, ఎం బాబు, షేక్ వలీపాషా, కె.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రక్తదాన శిబిరం

ఏలూరు(మెట్రో): ఏలూరు ప్రాంతీయ వ్యాపారం కార్యాలయం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ పి.కాళిదాసు మాట్లాడుతూ రక్తదాన శిబిరం 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రక్తదానంలో పాల్గొన్నట్టు చెప్పారు. చీఫ్ మేనేజర్ కె.లలిత, ఇంతియాజ్, హెచ్‌ఆర్ మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కొయ్యలగూడెం: గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన తనకు మండల అభివృద్ధి విషయంలో పూర్తి అవగాహన ఉందని నూతన తహసీల్దార్ ఎన్ నాగరాజు పేర్కొన్నారు. కార్యాలయానికి విచ్చేసిన ఆయన ఇప్పటివరకు తహసీల్దారుగా విధులు నిర్వహించిన కె.చెల్లన్నదొర నుంచి బాధ్యతలను స్వీకరించారు. వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడపా రాంబాబుల ఆధ్వర్యంలో వీఆర్వోలు తహసీల్దారుకు స్వాగతం పలికారు. ప్రతి సోమవారం నిర్వహించే (పీజీఆర్ఎస్) పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థలో వచ్చే సమస్యలను తీర్చడానికి ముఖ్య ప్రాధాన్యత ఇస్తానని నాగరాజు తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌కి బదిలీపై వెళుతున్న చెల్లన్న దొర మాట్లాడుతూ బాధ్యతలు నిర్వహించిన సంవత్సర కాలంలో ప్రజల మద్దతుతో పాటు రెవెన్యూ శాఖ సిబ్బంది, ప్రజలు తోడ్పాటు అందించారన్నారు. వీఆర్వోలు పొన్నా రమేష్, అడపా రామ్మోహన్, సుబ్బారావు, దంతోజు కుమార్, నాగేశ్వరరావు, బట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నూతన తహసీల్దార్ నాగరాజును అభినందిస్తున్న దృశ్యం

నాణ్యమైన భోజనం అందించాలి

కుక్కునూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ కె.రమేష్ బాబు సూచించారు. గురువారం ఆయన కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం విషయంలో రాజీ పడొద్దని రమేష్‌బాబు అన్నారు. వంట ప్రదేశం శుభ్రతగా ఉండాలన్నారు. భోజనం రుచి చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. తహసీల్దార్ వెంట ఎంఈఓ గిరి భగవాన్‌దాస్, హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హైస్కూల్లో తహసీల్దార్ పరిశీలన

జంగారెడ్డిగూడెం: స్థానిక బాలురు ఉన్నత పాఠశాలను గురువారం తహసీల్దార్ స్లీవజోజి సందర్శించారు. స్కూలులో మౌలిక సదుపాయాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అమలును ఆయన పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన బియ్యం గుడ్లు, ఇతర వంట సామగ్రిని తనిఖీలు చేశారు. వంట కార్మికులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.


కుక్కునూరు : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు


జంగారెడ్డిగూడెం : పాఠశాల స్టోర్ రూమ్‌లో పరిశీలన చేస్తున్న తహసీల్దార్ స్లీవజోజి

శాస్త్రోక్తంగా చండీహోమం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మవారి ఆలయంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు, వేదపండితులు సత్యకిరణ్‌లు నిర్వహించారు. చండీహోమంలో ఉభయదారులుగా దుసనపూడి ఏడుకొండలు, కొప్పుల లక్ష్మి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి 8 గంటలకు దుసనపూడి ఏడుకొండలు, పద్మావతి దంపతులు, అప్పన నాగేశ్వరారవు, జగదీశ్వరి దంపతులు, విజయదుర్గమ్మ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, తాతగుంట్ల రవికుమార్, తాతగుంట్ల నాగప్రసన్న ద్రవ్య సహకారంతో అన్న సమారాధన ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ, వెంకటరామయ్య, కౌన్సిలర్ వలవల తాతాజీ, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు.


ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తూ వందో వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న సందర్భంగా మూడేళ్లకు ఒకసారి నిర్వహించుకునే సీపీఐ అంతర్గత మహాసభలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో బాలిన కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది నాయకులు తమ ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి పోరాడారని తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని పట్టించుకోవడంలేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా రెండో మహాసభలు జులై 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 18న ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నాయకులు కురెళ్ల వర ప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, మావూరి విజయ, కొండేటి బేబీ పాల్గొన్నారు.

నేటి నుంచి రథయాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 13వ తేదీ నుంచి శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి శశి శేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రథయాత్ర సందర్భంగా ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, స్వామి వారికి ప్రభాత సేవ కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. 13, 14వ తేదీల్లో ఉంగుటూరు సబ్ జోన్‌లోని గ్రామాలతో పాటు జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ జోన్లలోని గ్రామాల్లో రథయాత్ర చేస్తామని వివరించారు. 15న జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు సబ్ జోన్‌లోని గ్రామాలు, 16న ద్వారకాతిరుమల, 17న ఏలూరు, కైకలూరు సబ్ జోన్లలోని పలు ప్రాంతాల్లో రథయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక యువకుడు స్నేహితులు తనపై కేసు పెట్టారనే మానసిక వేదనతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తంగెళ్లమూడి బోడిదిబ్బకు చెందిన ప్రగడ నాగేంద్ర ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నాడు. నాగేంద్ర తన స్నేహితులైన రాము, సాయితో పాటు ఈనెల 10న రాత్రి వేళ మద్యం తాగాడు. మద్యం మత్తులో స్నేహితులు ఇద్దరూ నాగేంద్రతో గొడవపడ్డారు. మరుసటి రోజు స్నేహితులిద్దరూ ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర మనస్థాపానికి గురైన నాగేంద్ర గురువారం ఇంటివద్ద ఉరివేసుకోగా అతడ్ని జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం కాలేజీ రోడ్డు వద్ద ఉన్న సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ చిన్న వయసులోనే సరైన వసతులతో కూడిన విద్యను అందించి బాల కార్మిక వ్యవస్థ నుంచి బాలలను రక్షించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను పనులకు పంపవద్దని అవగాహన కల్పించారు. న్యాయవాదులు మాదేపల్లి క్రాంతికుమార్, భువనేశ్వరి, బల్లే సాయికుమారి, పిల్లి పెద్దిరాజు, బిందు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రుణ మేళా


సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ కాళిదాసు

లింగపాలెం: ఎస్‌బీఐ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ పక్కాల కాళిదాసు అన్నారు. ధర్మాజీగూడెంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళిదాసు మాట్లాడుతూ ఎస్‌బీఐ ద్వారా డ్వాక్రా మహిళా రుణాలు, లింకేజీ లోన్‌లు, చిరు వ్యాపార రుణాలు, పాడి పరిశ్రమ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లిస్తే, ప్రతి రూ.లక్షకు కేంద్ర ప్రభుత్వంచే లక్షకు రూ.3 వేలు, రాష్ట్ర ప్రభుత్వంచే రూ.4 వేలు వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు. వివిధ పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పాలపర్తి రజనీకాంత్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాప్రోలు జ్యోతి, ఫీల్డ్ ఆఫీసర్ మొహమ్మద్ ఇమ్రాన్, రిలేషన్‌షిప్ మేనేజర్ నిర్మల్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు 'శక్తి'


బ్యానర్‌తో అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

ఏలూరు టౌన్ : జిల్లాలో మహిళలు, బాలికల అత్యవసర పరిస్థితుల్లో భద్రతకు, రక్షణ సహాయానికి శక్తి యాప్‌ను వినియోగించాలని ఏలూరు మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ బృందాలు నగరంలోని పార్కులు, బహిరంగ ప్రదేశాలు, జనాలు అధికంగా తిరిగే ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు ఏదైనా అత్యవసర ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే 112 లేదా 79934 85111కు కాల్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర సమయాల్లో ఒక్క క్లిక్‌తో క్షణాల్లోనే పోలీసులు ఘటనా స్థలిలో ఉంటారని తెలిపారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడినా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు.